www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 63 | | 14-8-2026 | | శుక్రవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |




## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు

4

అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది.

## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



4

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణలో ముస్లిం మైనార్టీల కు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఈ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు తీవ్ర కుట్రలు చేస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో అందించిన ఈ రిజర్వేషన్లను రద్దు చేయాలంటూ కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టుల మెట్లెక్కారని మండిపడ్డారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ చిత్తశు ద్ధితో నిలబడి మైనార్టీల సంక్షేమాన్ని అమలు చేస్తోందన్నారు. హైదరాబాద్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన ః మైనార్టీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ః (మైనార్టీల ప్రతిభా సదస్సు)కు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి పలు రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన మైనార్టీ ప్రముఖులకు సీఎం అవార్డులను ప్రదానం చేశారు.

2





## వాళ్ల పదేళ్ల పాలన.. మా రెండేళ్ల పాలనను
# బేరీజు వేయండి

- గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేశాం
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు.. చేసిన చేతబడి వారికే తిరగబడుతుంది
- హైదరాబాద్ పేదల కోసం తొలి విడతలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు
- కూకట్‌పల్లి అభివృద్ధికి నిధుల కొరత రానివ్వం
- 22-ఏ భూముల సమస్య పరిష్కారానికి నాదీ పూచీ
- సీఎం రేవంత్‌రెడ్డి

పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. గతంలో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, వాటిని మరింత పెంచి రెట్టింపు స్థాయిలో పేదలకు అందిస్తున్నామని చెప్పారు. కేపీహెచ్‌బీ కాలనీ సీయూఆర్ (జఖ=) పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సోదరుడిగా అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారు. గతంలో డబ్బా ఇళ్లు వద్దంటూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ నాయకులు మోసం చేశారని, కానీ తమ ప్రభుత్వం పట్టణ పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా మొదటి విడతలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అలాగే కూకట్‌పల్లి నియోజకవర్గంలో 22-ఏ (22=ూ) నిషేధిత భూముల జాబితా వల్ల ఇబ్బంది పడుతున్న వారి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. బాధితులు కొనుగోలు చేసిన భూములకు సబ్-నంబర్లు ఇచ్చి, వాటిని వారికి సొంతమయ్యేలా చూసే పూచీ తనదేనని భరోసా ఇచ్చారు.

*- హైదరాబాద్, ఆగస్టు 13 (ఉద్యమ కెరటం)*

2

## అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు

ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు

మాజీ స్పీకర్ పోచారం హాట్ కామెంట్స్

3



## ఆర్‌కేవీవైపై అమలులో
# తెలంగాణ భేష్

### రాష్ట్ర ప్రగతిని ప్రశంసించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

- రెండో విడత నిధులు త్వరగా విడుదల చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- ఎల్‌నినో పరిస్థితుల్లో పప్పుధాన్యాలను వందశాతం కొనుగోలు చేయాలని వినతి
- మొక్కజొన్న సహా ఇతర పంటల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరిన తుమ్మల
- రైతు క్షేత్ర పాఠశాల యాప్ అమలు తీరుపైనా కేంద్రం ప్రశంసలు

.. వివరాలు 2లో



## నల్సార్ విద్యార్థులకు బార్ కౌన్సిల్ షాక్

- ప్రధాన న్యాయమూర్తిని స్నాతకోత్సవానికి ఆహ్వానించడంపై విద్యార్థుల అభ్యంతరం
- 2026 బ్యాచ్ విద్యార్థుల నమోదును నిలిపివేయాలని ఆదేశం
- తదుపరి ఉత్తర్వుల వరకు న్యాయవాదులుగా నమోదు చేయొద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు స్పష్టీకరణ
- నిరసనకు నేతృత్వం వహించిన విద్యార్థుల వివరాలు కోరిన బీసీఐ

2




## నిర్మాత కారు బీభత్సం
## మహిళకు గాయాలు



- డ్రైవర్‌పై అబిడ్స్ పోలీసుల కేసు
- వైద్య ఖర్చులపై నిర్మాతను సంప్రదించిన కుటుంబం
- నిర్లక్ష్యంగా స్పందించారని బాధితుల ఆరోపణ
- ప్రమాదంపై కొనసాగుతున్న దర్యాప్తు

2

## వేలం వెర్రిగా ప్రభుత్వ భూముల అమ్మకం

- రాయదుర్గం హెరిటేజ్ భూముల వేలం వెంటనే ఆపాలి
- వివాదాలు తేలకముందే అమ్మకాలకు ఎందుకింత తొందర?
- ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలో మరో మాటనా?
- సీఎంకు హరీశ్‌రావు లేఖ

3





## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

3

- దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై..
## హైకోర్టులో వాదనలు

- స్పీకర్ తీర్పును సవాలు చేస్తూ పిటిషన్లు
- 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ విచారణ
- స్పీకర్ పరిధి దాటారని పిటిషనర్ల వాదన
- వార్తా కథనాలే ఆధారం కాదని కోర్టుకు వివరణ
- తదుపరి విచారణ ఈ నెల 17న

.. వివరాలు 2లో



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
14 ఆగస్టు 2026




# నల్సార్ విద్యార్థులకు బార్ కౌన్సిల్ షాక్

**ప్రధాన న్యాయమూర్తిని స్నాతకోత్సవానికి ఆహ్వానించడంపై విద్యార్థుల అభ్యంతరం**

**2026 బ్యాచ్ విద్యార్థుల నమోదును నిలిపివేయాలని ఆదేశం**

**తదుపరి ఉత్తర్వుల వరకు న్యాయవాదులుగా నమోదు చేయొద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు స్పష్టీకరణ**

**నిరసనకు నేతృత్వం వహించిన విద్యార్థుల వివరాలు కోరిన బీసీఐ**

**హైదరాబాద్, ఆగస్టు 13:** హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ విద్యార్థుల విషయంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. నల్సార్ నుంచి 2026లో న్యాయ పట్టా పొందిన విద్యార్థులను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు న్యాయవాదులుగా నమోదు చేయవద్దని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లను ఆదేశించింది. నల్సార్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై కొందరు విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడం వివాదానికి దారితీసింది. 2026లో పట్టా పొందనున్న విద్యార్థులతోపాటు ఇతర బ్యాచ్‌లకు చెందిన కొందరు విద్యార్థులు కూడా ఈ అభ్యంతరాలకు మద్దతు తెలిపినట్లు సమాచారం. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలోనే విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా.. నల్సార్ నుంచి 2026లో న్యాయ పట్టా పొందిన విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల నిరసన వెనుక ప్రధానంగా ఎవరు ఉన్నారు, ప్రచారాన్ని ఎవరు ప్రారంభించారు, ఎవరు సమన్వయం చేశారన్న అంశాలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని నల్సార్ విశ్వవిద్యాలయాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోరింది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై.. హైకోర్టులో వాదనలు

**స్పీకర్ తీర్పును సవాలు చేస్తూ పిటిషన్లు**

**10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ విచారణ**

**స్పీకర్ పరిధి దాటారని పిటిషనర్ల వాదన**

**వార్తా కథనాలే ఆధారం కాదని కోర్టుకు వివరణ**

**తదుపరి విచారణ ఈ నెల 17న**

**హైదరాబాద్, ఆగస్టు 13:** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం నిర్ణయం తీసుకునే సమయంలో స్పీకర్ చట్టంలో లేని అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదించారు. ప్రభుత్వ స్థిరత్వం, అసెంబ్లీలో పార్టీల బలం, ప్రతిపక్షానికి ఉన్న మద్దతు వంటి అంశాలను పరిశీలించడం స్పీకర్ పరిధిలోకి రాదని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఉద్దేశం కేవలం అసెంబ్లీలో రాజకీయ సమీకరణాలను నిర్వహించడం కాదని న్యాయవాది తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును పార్టీ ఫిరాయింపుల ద్వారా నిర్వీర్యం కాకుండా చూడటమే దాని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని స్పీకర్ తీర్పులో పరిగణనలోకి తీసుకోలేదని వాదించారు. అనర్హత పిటిషన్లలో కేవలం వార్తా కథనాలనే ఆధారంగా చూపలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు స్పష్టం చేశారు. ఎన్నికల గెజిట్లు, అధికారిక పత్రాలు, ఫారం-26 అఫిడవిట్లను సాక్ష్యాలుగా సమర్పించినట్లు తెలిపారు. వార్తా కథనాల మూలాలు, రిపోర్టర్లు, ఎడిటర్ల వివరాలు లేవన్న కారణంతో పిటిషన్లను తిరస్కరించడం సరికాదని కోర్టుకు వివరించారు.

### 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారం

కాలే యాదయ్య, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టి.ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకట్‌రావు, గూడెం మహిపాల్‌రెడ్డి, సంజయ్‌కుమార్‌లపై అనర్హత వేటు కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీరిపై ఫిరాయింపు ఆరోపణలు ఉన్నప్పటికీ అధికారికంగా పార్టీ మారలేదన్న స్పీకర్ నిర్ణయాన్ని పిటిషనర్లు సవాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్, పల్లె రాజేశ్వర్‌రెడ్డితో పాటు బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ కొనసాగుతోంది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.



# వాళ్ల పదేళ్ల పాలన.. మా రెండేళ్ల పాలనను బేరీజు వేయండి

- గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేశాం
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు.. చేసిన చేతబడి వారికే తిరగబడుతుంది
- హైదరాబాద్ పేదల కోసం తొలి విడతలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు
- కూకట్‌పల్లి అభివృద్ధికి నిధుల కొరత రానివ్వం
- 22-ఏ భూముల సమస్య పరిష్కారానికి నాదీ పూచీ
- సీఎం రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్, ఆగస్టు 13:** పదేళ్ల బీఆర్ఎస్ పాలనను, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలను కొనసాగిస్తూనే సంక్షేమాన్ని మరింత విస్తరించామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు చెల్లిస్తూనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం తమ ప్రభుత్వానికి వచ్చిందని రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. తొలి విడతలో నగరంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. "డబ్బా ఇళ్లు వద్దు.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పినవారు మీలో ఎంతమందికి ఇళ్లు ఇచ్చారో చెప్పాలి. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా అండగా ఉంటా" అని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కొందరు కుట్రలు చేశారని ఆరోపించారు. "చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి తయారైంది. అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడుతుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుండాలన్నదే. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు ప్రజల కోసం పనిచేయకుండా చేతబడులు చేయిస్తారా?" అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని సీఎం చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.12 వేల కోట్లు చెల్లించామని, స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు అందించామని, మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చామని వివరించారు. తెలంగాణలో 3.28 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. కూకట్‌పల్లి ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాను పార్లమెంట్‌కు పోటీ చేసినప్పుడు కూకట్‌పల్లి ప్రజలు ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని, ఇప్పుడు అన్ని అధికారాలు ఉన్నాయని చెప్పారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును ఆదేశిస్తున్నట్లు తెలిపారు. 22-ఏ భూముల సమస్యపైనా సీఎం స్పందించారు. ప్రజలు కొనుగోలు చేసిన భూములు పొరపాటున నిషేధిత జాబితాలో చేరితే వాటిని తిరిగి వారికి ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. ఒక సర్వే నంబర్‌లో కొంత భూమికి సమస్య ఉంటే మొత్తం భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదని, అవసరమైన చోట సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. "పదేళ్ల వారి పాలన.. రెండేళ్ల మా పాలనను ప్రజలే పోల్చి చూడాలి. ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చుకుంటూనే మరోవైపు సంక్షేమాన్ని అమలు చేస్తున్నాం. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నాం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

**కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు**

**ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి**

**మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్, ఆగస్టు 13:** రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ రిజర్వేషన్లను రద్దు చేయించేందుకు కొందరు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సులో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ లౌకికవాదానికి కట్టుబడి ఉందని చెప్పారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా చూస్తుందని పేర్కొన్నారు. మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తే వాటిని రద్దు చేయాలని కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారని విమర్శించారు. కాంగ్రెస్ ఉన్నంతకాలం దేశంలోని లౌకికవాద వర్గాల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 నియామకాలు సక్రమంగా నిర్వహించలేకపోయారని సీఎం విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి విద్యావంతులు, అనుభవజ్ఞులను నియమించామని చెప్పారు. న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి గ్రూప్-1తోపాటు ఇతర ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగంతోపాటు రూ.3 కోట్ల ప్రోత్సాహకం అందించామని, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని గుర్తుచేశారు. మైనారిటీ యువత చదువుతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ అంశంపైనా సీఎం స్పందించారు. ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "గల్లీగల్లీ తిరగండి.. ఇంటింటికీ వెళ్లండి.. ప్రతి ఒక్కరి ఓటు ఉందో లేదో పరిశీలించండి. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలి" అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఆర్‌కేవీవైపై అమలులో తెలంగాణ భేష్

- రాష్ట్ర ప్రగతిని ప్రశంసించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్
- రెండో విడత నిధులు విడుదల చేయాలని తుమ్మల విజ్ఞప్తి
- ఎల్‌నినో పరిస్థితుల్లో పప్పుధాన్యాలను వందశాతం కొనుగోలు చేయాలని వినతి



**హైదరాబాద్, ఆగస్టు 13:** రాష్ట్రీయ కృషి వికాస్ యోజన అమలులో తెలంగాణ సాధిస్తున్న ప్రగతిని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు పురోగతిపై మూడు రాష్ట్రాలతో నిర్వహించిన వీడియో సమావేశంలో తెలంగాణ వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన అమలులో తెలంగాణ పనితీరు బాగుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు క్షేత్ర పాఠశాల యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తున్న తీరును కూడా ప్రశంసించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద తెలంగాణకు రావాల్సిన రెండో విడత నిధులను వీలైనంత త్వరగా మంజూరు చేసి విడుదల చేయాలని తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై శివరాజ్‌సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందిస్తూ నిధుల విడుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### పప్పుధాన్యాలు వందశాతం కొనాలి

రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తుమ్మల కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్‌లో ధరల ఒడిదుడుకుల నుంచి రైతులను ఆదుకునేందుకు తెలంగాణలో పండించే పప్పుధాన్యాలను వందశాతం కొనుగోలు చేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విజ్ఞప్తిపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

### మొక్కజొన్న కొనుగోలుపైనా ప్రత్యేక దృష్టి

తెలంగాణలో ఉత్పత్తయ్యే మొక్కజొన్నతోపాటు ఇతర పంటల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తుమ్మల కోరారు. రైతులు తమ పంటలను విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగానే కొనుగోలు ఏర్పాట్లు చేయాలని, కేంద్ర సంస్థలతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో ముందుకు సాగుతామని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు రైతులకు గిట్టుబాటు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

# నిర్మాత కారు బీభత్సం

**మహిళకు గాయాలు**

**డ్రైవర్‌పై అబిడ్స్ పోలీసుల కేసు**

**వైద్య ఖర్చులపై నిర్మాతను సంప్రదించిన కుటుంబం**

**హైదరాబాద్, ఆగస్టు 13:** హైదరాబాద్‌లోని అబిడ్స్ పరిధిలో సినీ నిర్మాత బొమ్మకు మురళికి చెందిన కారు ప్రమాదానికి గురై ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డారు. చాపెల్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న నాంపల్లి ఆండాళమ్మ బస్తీకి చెందిన సునీతను కారు ఢీకొనడంతో ఆమె కాలికి ఫ్రాక్చర్ కావడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీఐ బ్యాంకులో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీత ఆగస్టు 12న సాయంత్రం విధులు ముగించుకుని చాపెల్ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో నిర్మాత వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న మహానంద కారును వేగంగా నడుపుతూ ఆమెను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సునీత చికిత్సకు అయ్యే ఖర్చుల కోసం ఆమె కుటుంబ సభ్యులు కారు యజమాని మురళిని ఫోన్‌లో సంప్రదించినట్లు తెలిపారు. అయితే, తమ విజ్ఞప్తికి ఆయన నిర్లక్ష్యంగా, దురుసుగా స్పందించారని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కుటుంబం ఫిర్యాదు ఆధారంగా అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణాలు, కారు నడిపిన వ్యక్తి వ్యవహారం, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.



బొమ్మకు మురళి టెక్నోక్రాట్‌గా, సామాజిక, రాజకీయ కార్యకర్తగా పనిచేసిన అనంతరం సినీ నిర్మాతగా మారారు.

# అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు



- ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు
- పోచారం మరోమారు హాట్ కామెంట్స్

**కామారెడ్డి, ఆగస్ట్ 13:** అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌కి మద్దతు ఇచ్చానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అన్నం పెట్టిన వాళ్లను మరిచిపోతే పుట్టగతులుండవన్నారు. కేసీఆర్ చేశారు కాబట్టే.. చేశారని చెప్పానని.. రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతానని తెలిపారు. ఉన్నది ఉన్నట్లు చెప్పడం తన నైజమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు. దానికి కొనసాగింపుగా గురువారం కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం' అని స్పష్టం చేశారు. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయనని స్పష్టం చేశారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తానన్నారు. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలని.. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేమని పోచారం శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

# వేలం వెర్రిగా భూముల అమ్మకం

- ప్రభుత్వ భూముల జాడలేకుండా మాయం
- రాయదుర్గం భూ వేలాన్ని వెంటనే ఆపాలి
- సీఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ





హైదరాబాద్, ఆగస్ట్ 13: రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణను దోచుకోవడంలో బీఆర్ఎస్‌తో పోటీ

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపీ రఘునందన్ రావు
- యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణెళినికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

# బీసీ మహిళలకు స్వయం ఉపాధి

## ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, ఆగస్ట్ 13:** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్దిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్దిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.



# త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

## దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 13 :** దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# అంత్యక్రియలకు వచ్చి..

## చెరువులో దిగి ఇద్దరు మృత్యువాత

**సంగారెడ్డి, ఆగస్ట్ 13:** జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. జిన్నారం మండలం వావిలాల గ్రామంలో చెరువులో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వచ్చిన గణెళిష్ (30), మునిరాజు (58) ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఇద్దరూ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గణెళిష్‌కు ఒక్కసారిగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. చెరువులో మునిగిపోతున్న గణెళిష్‌ను గమనించిన మునిరాజు.. కాపాడేందుకు వెంటనే నీటిలోకి వెళ్లాడు. అయితే గణెళిష్‌ను రక్షించే ప్రయత్నంలో మునిరాజు కూడా నీటిలో మునిగిపోయాడు. ఇద్దరూ చాలాసేపు బయటకు రాకపోవడంతో అక్కడ ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందడంతో స్థానికులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీసినట్లు సమాచారం. అంత్యక్రియలకు హాజరైన కుటుంబాల్లో ఈ ఘటన మరో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పు తీర్చనందుకు బాలికను తీసుకెళ్లే యత్నం

## కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల కేసు

**హైదరాబాద్, ఆగస్ట్ 13:** హైదరాబాద్‌లో బాకీ తీర్చలేదని రెండేళ్ల బాలికను కిడ్నాప్‌నకు ఓ వ్యక్తి యత్నించాడు. అప్పు తీర్చలేదనే కోపంతో బాలికను తీసుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. అయితే బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. హనుమాన్ నగర్‌లో అద్దె ఇంట్లో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. మానికేశ్వరీ నగర్‌లో నివాసం ఉన్న సమయంలో పరిచయస్తుడి వద్ద రూ.30 వేల అప్పును బాలిక కుటుంబ సభ్యులు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లించకపోవడంతో బుధవారం ఇంటికి ఆ వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతో సదరు వ్యక్తి వాగ్వాదానికి దిగాడు. డబ్బులు ఇచ్చే వరకు మీ కుమార్తెను తీసుకెళ్తానంటూ అతడు బెదిరించాడు. రెండేళ్ల బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై బాధిత కుటుంబం పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# టెస్సరాక్ట్ సంస్థకు భూకేటాయింపులపై రాజకీయం

## భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపాటు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** టెస్సరాక్ట్ సంస్థకు కేటాయించిన భూములపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. 'ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో బీఆర్ఎస్ హయాంలో 54 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. వారి హయాంలో ఎకరాకు రూ.30లక్షల నుంచి రూ.80లక్షల చొప్పున ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చాక 8 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. ఎకరా రూ.1.50 కోట్లకు కేటాయించాం. 5 ఎకరాలు కావాలని టెస్సరాక్ట్ సంస్థ 2024లో దరఖాస్తు చేసుకుంది. ఏడాదిపాటు పరిశీలించి ఆ సంస్థకు 2025లో భూమిని కేటాయించాం. అందరికీ కేటాయించినట్టుగానే ఆ సంస్థకు కూడా ఎకరా రూ.1.50 కోట్ల చొప్పున ఇచ్చాం. 2025 వరకు టెస్సరాక్ట్ సంస్థకు కొండల్‌రెడ్డి డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్ కాదని ఎంపీ చామల వివరించారు.

# వివాహేతర సంబంధంతో హత్య

## భార్యను హత్య చేసిన భర్త

**నాగర్‌కర్నూల్, ఆగస్ట్ 13:** నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం కోట్ర గ్రామానికి చెందిన వివాహిత దారుణ హత్యకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోట్ర గ్రామానికి చెందిన నారుమళ్ల అనూష(22) కల్వకుర్తి పట్టణంలోని ఓ లేడీస్ కార్నర్‌లో పనిచేస్తోంది. ఆమె భర్త చెన్నయ్య ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. అనూష గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తితో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి రాములు.. అనూషను ఒడ్డోనిరాళ్ల వద్దకు తీసుకెళ్లి హత్య చేసి, ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించి దహనం చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హత్యకు పాల్పడిన రాములుతోపాటు అతనికి సహకరించిన మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కల్వకుర్తి, వెల్దండ సీఐలు భీమ్‌కుమార్, రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
14 ఆగస్టు 2026

## సంపాదకీయం



# పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు!

### 19 రోజులూ రభసే.. ప్రజా సమస్యలకు చోటేది?

**అధికార-ప్రతిపక్షాల పంతాలతో తుడిచిపెట్టుకుపోయిన సభా సమయం**

**చర్చకు సిద్ధమన్న ప్రభుత్వం.. అమిత్ షా ప్రసంగం వినబోమన్న విపక్షం**

**సభలను వృథా చేసే సభ్యుల జీతభత్యాలు కోత పెట్టాలన్న డిమాండ్**

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మట్టికరవడానికి అధికార, ప్రతిపక్షాలు రెండూ బాధ్యత వహించాల్సిందే. ప్రజలు ఎంతో నమ్మకంతో ఎన్నుకుని పంపిన ప్రజాప్రతినిధులు చట్టసభలను వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలకు వేదికగా మార్చడం ప్రజాస్వామ్యానికే అవమానం. సమస్యలను చర్చించి పరిష్కారాలు కనుగొనాల్సిన అత్యున్నత చట్టసభ 19 రోజుల పాటు నినాదాలు, నిరసనలు, పరస్పర ఆరోపణలతోనే గడిచిపోవడం బాధాకరం. చట్టసభల్లో ప్రజల సమస్యలు చర్చించాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించి సమాధానాలు రాబట్టాలి. అవసరమైన చట్టాలు చేయాలి. ప్రజలకు మేలు చేసే విధానాలపై లోతైన చర్చ జరగాలి. కానీ ఈ సమావేశాల్లో అవేవీ ఆశించిన స్థాయిలో జరగలేదు. ప్రతిపక్షాలు ఆందోళనలతో సభను అడ్డుకుంటే.. సభను సజావుగా నడిపించేందుకు అధికార పక్షం కూడా అవసరమైన రాజకీయ చొరవ చూపలేకపోయింది. చివరకు 'దొందూ దొందే' అన్నట్లుగా పరిస్థితి తయారైంది. జులై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాల్లో వరుసగా 19 రోజుల పాటు సభా కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. చివరి రోజు కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అధికార, ప్రతిపక్షాలు ఎవరి పట్టును వారు వీడకపోవడంతో విలువైన సభా సమయం వృథా అయింది. విద్యార్థుల ఆందోళనలపై చర్చకు సిద్ధమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడం, అవసరమైతే సమావేశాలను పొడిగించేందుకు కూడా సిద్ధమని ప్రభుత్వం చెప్పడం చివరి దశలో కీలక పరిణామంగా మారింది. ప్రతిపక్షాలతో సంప్రదించి చర్చకు సమయం కేటాయించాలని అమిత్ షా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ కూడా రాశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తానని, మొత్తం చర్చలో తాను పాల్గొంటానని ప్రకటించారు. అయితే అమిత్ షా ఉపన్యాసం వినడానికి తాము సిద్ధంగా లేమని ప్రతిపక్షం తేల్చిచెప్పింది. విద్యార్థులపై పెల్లెట్ గన్‌ల వినియోగానికి ఎవరు ఆదేశించారో ముందుగా సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ పట్టుబట్టారు. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం వెనక్కి తగ్గడం చూస్తున్నామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. మరోవైపు ప్రభుత్వ ప్రతిపాదన అసలు సమస్య నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమేనని విపక్షం ఎదురుదాడి చేసింది. ఇలా ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ జరగాల్సిన సభ రాజకీయ బలప్రదర్శనకు వేదికగా మారింది. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ పోడియం వైపు వెళ్లడం, స్పీకర్ వారించడం నిత్యకృత్యంగా మారితే.. అధికార పార్టీ సభ్యులు సైతం మకరద్వారం వద్ద ప్రతిపక్షాన్ని నిలదీస్తూ నినాదాలకు దిగారు. సభ లోపలా, బయటా పోటాపోటీ నిరసనలే కనిపించాయి. ప్రతిపక్షం బలంగా గళం వినిపించడం ప్రజాస్వామ్యానికి అవసరమే. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కూడా దాని బాధ్యతే. కానీ నిరసనే అంతిమ లక్ష్యంగా మారి సభా కార్యకలాపాలే జరగకుండా పోతే చివరకు నష్టపోయేది ప్రజలే. అదే విధంగా ప్రతిపక్షాన్ని తప్పుబట్టడంతో సరిపెట్టకుండా సభను నడిపించే బాధ్యత అధికార పక్షంపైనా ఉంటుంది. అందుకే ఈ వైఫల్యానికి ఒక పక్షాన్నే బాధ్యులను చేయడం సరికాదు. ప్రజలు తమ నియోజకవర్గ సమస్యలను సభలో వినిపిస్తారని, దేశాన్ని వేధిస్తున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్య, వైద్యం, రైతాంగం, ఆర్థిక సమస్యలపై తమ ఎంపీలు ప్రశ్నిస్తారని ఆశిస్తారు. కానీ కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాల్సిన పార్లమెంట్ రాజకీయ పంతాలకు బలైతే ప్రజాస్వామ్య వ్యవస్థలపైనే నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉంటుంది. ఇకనైనా ప్రజలు కూడా తమ ప్రతినిధుల పనితీరును ప్రశ్నించాలి. ముఖ్యంగా కొత్తతరం యువత సభల్లో ఎవరు ఏం మాట్లాడుతున్నారు? ప్రజా సమస్యలపై ఎవరు నిలబడుతున్నారు? ఎవరు కేవలం రాజకీయ ప్రదర్శనకే పరిమితమవుతున్నారు? అన్నది గమనించాలి. సభలను ఉద్దేశపూర్వకంగా స్తంభింపజేసి ప్రజాధనాన్ని వృథా చేసే సభ్యుల విషయంలో జవాబుదారీతనం తీసుకురావాలన్న చర్చ కూడా జరగాలి. సభా సమయాన్ని నిరంతరం వృథా చేసే సందర్భాల్లో జీతభత్యాల కోత వంటి చర్యలకు స్పష్టమైన నిబంధనలు ఉండాలా అన్నదానిపై దేశవ్యాప్తంగా చర్చ అవసరం. ఎందుకంటే పార్లమెంట్ ఎవరి వ్యక్తిగత రాజకీయ వేదిక కాదు. అది ప్రజల గొంతు. ఆ గొంతునే నినాదాల హోరులో మూగబోయేలా చేస్తే.. చివరకు అవమానించబడేది పార్లమెంట్ కాదు.. దాని వెనుక నిలిచిన భారత ప్రజలే!

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా**



**న్యూఢిల్లీ, ఆగస్టు 13:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యు-వతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

## ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

**ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. అల్‌ఖైదా తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్‌కు పాక్ అండ

**పాక్‌వైపు కన్నెత్తితో భారత్ సర్వనాశనం తప్పదు**

**అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రేలాపన**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

## సొరంగంలో నీరు, మట్టి, 10 మంది గల్లంతు

**సొరంగంలో చిక్కుకున్న 18 మంది కార్మికులు**

**ఎనిమిది మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన సహాయక బృందాలు**

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సొరంగంలోకి ఒక్కసారిగా భారీగా నీరు, మట్టి, రాళ్లు దూసుకురావడంతో 18 మంది కార్మికులు చిక్కుకుపోయారు. వీరిలో ఎనిమిది మందిని సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీసుకురాగా, మరో 10 మంది ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. చమోలి జిల్లాలోని పీపల్‌కోటి వద్ద టెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాజెక్టు సొరంగంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కార్మికులు పనుల్లో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా భారీగా నీరు సొరంగంలోకి ప్రవేశించింది. నీటి ఉద్ధృతికి కొందరు కార్మికులు ప్రవేశద్వారం వైపు కొట్టుకురాగా, మరికొందరు లోపలే చిక్కుకుపోయినట్లు అధికారులు భావిస్తున్నారు. నీటితోపాటు పెద్దఎత్తున మట్టి, రాళ్లు సొరంగంలోకి చేరడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. గల్లంతైన 10 మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు జాతీయ విపత్తు నిర్వహణ దళం, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం బృందాలు రంగంలోకి దిగాయి. సొరంగంలోకి చేరేందుకు ఉన్న మార్గాలను పరిశీలిస్తూ సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నాయి.

# జనసేన బలోపేతానికి కలిసికట్టు గా పనిచేయాలి

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** తెలంగాణలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని జనసేన పార్టీ పార్లమెంటరీ కోఆర్డినేటర్ సంపత్కుమార్, జాయినింగ్ కమిటీ సభ్యుడు, పెద్దపల్లి పార్లమెంట్ కోఆర్డినేటర్ నరేష్రెడ్డిలు పిలుపునిచ్చారు. ఈనెల 30న మంచిర్యాలలో నిర్వహించనున్న జనసేన పార్టీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో పార్టీ కార్యక్రమాలపై చర్చించేందుకు గురువారం కాగజ్నగర్లో జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజల తరపున నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గా ల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిర్పూర్ నియోజకవర్గం జనసేన నాయకులు అల్లూరి సాయికుమార్, పోతుల ప్రవీణ్, వినేష్రెడ్డి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నర్మాల ప్రాజెక్టు పరిరక్షణకు చాడ వెంకటరెడ్డి పర్యటన




**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణ సమితి విజ్ఞప్తి మేరకు సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి శుక్రవారం ఉదయం 10 గంటలకు నర్మాల ప్రాజెక్టును సందర్శించనున్నట్లు సమితి కన్వీనర్ అబ్దుల్ మజహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు సమస్యలను పరిశీలించి రైతులతో సమావేశం కానున్నట్లు పేర్కొన్నారు. గత వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించడంతో పాటు, లింగన్నపేట–గంభీరావుపేట మధ్య పూర్తికాని వంతెన పనులను కూడా పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు కింద సుమారు 13వేల ఎకరాలు సాగుకు నోచుకోకపోవడంపై చాడ వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టులో వాస్తవ నీటి నిల్వపై అధికారులు పారదర్శక సమాచారం వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రాజెక్టు అభివృద్ధికి అవసరమైన నిధులు సాధించడమే తమ లక్ష్యమని తెలిపారు. "మన మానేరు.. మన భవిష్యత్తు" నినాదంతో చేపడుతున్న కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# సర్పంచ్ ఆడే శీల చొరవతో తొలగిన విద్యుత్ ముప్పు

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గ్రామ ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సర్పంచ్ ఆడే శీల చేపట్టిన చర్యలతో విద్యుత్ ముప్పు తొలగింది. గ్రామంలో ప్రమాదకరంగా మారిన పాత ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో గురువారం నూతన సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో ఇనుప స్తంభాల కారణంగా విద్యుత్ షాక్ ప్రమాదం జరిగే అవకాశం ఉందని గుర్తించిన సర్పంచ్ విద్యుత్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ ఉద్యోగి రాథోడ్ సతీష్ పర్యవేక్షణలో పనులు పూర్తయ్యాయి. ప్రజల భద్రత కోసం సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజల రక్షణకు సర్పంచ్ చూపుతున్న శ్రద్ధను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం మండల అధ్యక్షుడు అర్షద్ ఖురేషి, వార్డు సభ్యులు లక్ష్మి, ఎల్లయ్య, గ్రామస్తులు తెలిపారు.

# పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

**టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోయాం ఇందురావు**




**ఉద్యమ కెరటం, కౌటాల:** పీఆర్సీని వెంటనే ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోయాం ఇందురావు డిమాండ్ చేశారు. యూఎస్పీసీ దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా గురువారం కౌటాల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టా రు. అనంతరం తహశీల్దార్ ప్రమోద్కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీఆర్సీ కాలపరిమితి ముగిసి 36 నెలలు గడిచినా ఇప్పటివరకు కొత్త పీఆర్సీని ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. వివిధ రకాల పెండింగ్ బిల్లులు, జీపీఎఫ్ రుణాలను మంజూరు చేయడంతో పాటు జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 19న జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహిస్తామని, 29న హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వినోద్, గుణాకర్ చౌదరి, రవికుమార్, చిలుకయ్య, రాథోడ్ కృష్ణ, రావుజి, సంతోష్, గంగాసింగ్, చంద్రమౌళి, విలాస్, భగవాన్, తిరుపతి, అవినాష్, కృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరీక్ష పరికరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వినియోగించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రోగులకు ఆరోగ్య పరీక్ష పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎన్ఐసి సమావేశ మందిరంలో స్క్రీనింగ్ పరికరాల వినియోగంపై ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతలో భాగంగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఓమ్ని ఆక్టివ్ కేర్ ఫౌండేషన్ వారి సహకారంతో హెల్త్ ప్రాజెక్ట్ కాంట్రిబ్యూషన్ లో భాగంగా అందించిన హెల్త్ స్క్రీనింగ్ పరికరాలు, మల్టీ పారామెట్రిక్ డయాగ్నొస్టిక్ డివైస్ లను వినియోగించుకుని తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చికిత్సల కోసం వచ్చే రోగులకు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరికరాలను అందించడం జరిగిందని, స్క్రీనింగ్ పరికరాల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని, మారుమూల గ్రామాల ప్రజలకు



ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకాంక్షిత బ్లాక్ సమన్వయకర్త డా. బాలరాజు, స్టాఫ్ నర్సులు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రభుత్వ కార్యాలయాలలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ను పరిశీలించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. విధులలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలకు ఉపేక్షించేది లేదని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శిక్షణాలయమా.. ఇతర అవసరాల నిలయమా...?

- **డైట్ కళాశాల భవనాన్ని వెంటనే పునరుద్ధరించాలి**
- **డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గతంలో నిర్మించిన డైట్ కళాశాల భవనం ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని, దానిని వెంటనే పునరుద్ధరించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భావి ఉపాధ్యాయులను తీర్చిదిద్దే డైట్ కళాశాల జిల్లాలోని విద్యార్థులకు ఎంతో కీలకమని రమేష్ పేర్కొన్నారు. అయితే ఆ భవనం ప్రస్తుతం పర్యవేక్షణ లేక పాడుబడటమే కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తుండటం విచారకరమన్నారు. సొంత భవనం పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం వల్ల ఉపాధ్యాయ శిక్షణ పొందే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భవనం పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, తక్షణమే మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇతర అవసరాలకు వినియోగిస్తున్న డైట్ భవనాన్ని పూర్తిగా ఖాళీ చేయించి, విద్యార్థుల విద్యాబోధనకే కేటాయించాలన్నారు. అలాగే భవనానికి మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి వెంటనే



చర్యలు తీసుకోకపోతే విద్యార్థులు, యువతను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీ వై ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు గెడం టికానంద్, గొడిసెల కార్తీక్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్, నాయకుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# చేతి పంపు ఆక్రమణపై నోటీసులకే పరిమితం

**గడువు ముగిసినా చర్యలు శూన్యం**

**ఉద్యమ కెరటం, కెరమెరి:** ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలను ఉపేక్షించబోమని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం చర్యలు కనిపించడం లేదని అగర్వాడ గ్రామపంచాయతీ పరిధిలోని నింగూడ గ్రామ ఘటనపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రభుత్వ చేతిపంపు ఆక్రమణకు గురైందని గుర్తించిన పంచాయతీ అధికారులు జూలై 28న సంబంధిత వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల్లోగా ఆక్రమణను స్వచ్ఛందంగా తొలగించాలని ఆదేశించారు. అయితే నోటీసు గడువు ముగిసి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు ఆక్రమణ తొలగింపుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన చేతిపంపు వినియోగానికి అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.




నోటీసులు జారీ చేయడం వరకు స్పందించిన అధికారులు, ఆ తర్వాత చర్యలు తీసుకోకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందించలేదని గ్రామస్తులు తెలిపారు. ప్రజా సమస్యపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ చేతిపంపు ఆక్రమణను వెంటనే తొలగించి ప్రజలకు నీటి సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే నోటీసుల అనంతరం కూడా చర్యలు తీసుకోకపోవడంపై సంబంధిత అధికారుల తీరును పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం, వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి, కన్నెపల్లి, నెన్నెల మండలాల్లో పర్యటించి పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలను పరిశీలించారు. బెల్లంపల్లి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, భోజనశాల, వంటశాల, తాగునీటి వసతి, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని, చదువుపై ఆసక్తి పెరిగేలా బోధనా పద్ధతులను అవలంభించాలని సూచించారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం సకాలంలో అందించాలని, ఆహారంలో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో పాఠశాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుద్ధ్య చర్యలను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటులో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల నిర్మాణ




పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత సమయంలో జారీ చేయాలన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లు, కుట్టుమిషన్ పంపిణీ చేశారు. పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మదాసి రమాదేవి, బాల్యమిత్రురాలు ఎంటి.రాజేశ్వరి సహకారంతో సుమారు రూ.1.80 లక్షల విలువైన సైకిళ్లు, కుట్టుమిషన్ అందించినట్లు తెలిపారు. బాలికల విద్యకు సహకారం అందించడం అభినందనీయమని కొనియాడారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలోని పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, గ్రామసభ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఆయన వెంట డీపీఓ సతీష్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా డీసీఈబీ కార్యదర్శి పి.మహేశ్వరరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# గ్రామ స్థాయి నుంచే పార్టీని పటిష్టం చేయాలి

• డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ఉద్యమ కెరటం, కెరమెరి:** గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పిలుపునిచ్చారు. కెరమెరి మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గురువారం నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యాంనాయక్ తో కలిసి ఆమె ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా కార్యాలయ ఆవరణలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. తదనంతరం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ సుజాయిత్ ఖాన్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ మండల స్థాయిలో పార్టీ కార్యాలయం అందుబాటులోకి రావడం ఎంతో అభినందనీయమని, ఇది నాయకులు, కార్యకర్తలకు ఎల్ల ప్పుడూ కేంద్రబిందువుగా నిలుస్తుందన్నారు. పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలని సూచించారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యాంనాయక్ మాట్లాడుతూ కెరమెరి మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతన కార్యాలయం పార్టీ కార్యకలాపాల నిర్వహణకు, కార్యకర్తల సమన్వయానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మంగ , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కోవా ఇందిరా, మారుతి పటేల్, సాజిద్ దేశముఖ్, రాథోడ్ శంకర్ నాయక్, వాగ్మారే శ్రీకాంత్, మొహర్లే పోశెట్టి, మొహర్లే రమేష్, రాథోడ్ జలపత్, వడ్డెయి శ్రీకాంత్, డా. ముండే మహదేవ్, షేక్ రహూఫ్, షేక్ మహమ్మద్, సొంకంబ్లె మిలింద్ కుమార్, రాథోడ్ రవి నాయక్, గుండి బాపురావు, రోహిదాస్ సిలోత్, చాటారే హనుమంతు, శంశు ఖాన్, రాథోడ్ సక్లాల్, షేక్ హుస్సేన్, మురళి గంటేవాడ్, పిట్ల ఆనందరావు, షేక్ ఫరూక్, రాథోడ్ దేవీదాస్, ప్రకాష్ జాదవ్, గోగర్ల రాజయ్యా, జగన్నాథ్, మొహాలీ బాపురావు, కర్పెత విమల బాయి, శంకర్, కోట్రంగే తిరుపతి, రాథోడ్ ధర్మ సింగ్, సెండే హనుమంతు, కోట్రంగే నాగు పటేల్, రాథోడ్ సాకారం, కోట్రంగే హనుమంతు, రాథోడ్ సుదర్శన్, మాడవి రాజు, పిట్ల గిడ్డప్ప, అదే దిలీప్, కనక మనోహర్, ఆత్రం తిరుపతి, షేక్ మూస సాబ్, వాడయి అన్నారావు, చాటారే శంకర్, గూగ్లో త్ అన్నజ్, రాథోడ్ విజేష్ నాయక్, ఆత్రం రాజు, భూపేందర్, దేవేందర్, పెందుర్ వినయ్, ఆత్రం చిత్రూ, కోవా బాదిరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో నాణ్యత లోపాలు..!

• పరిశీలించి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుడి విజ్ఞప్తి





**ఉద్యమ కెరటం, జైనూర్:** పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిర్మాణ పనుల నాణ్యతపై ఓ లబ్ధిదారుడు ఆందోళన వ్యక్తం చేశారు. జైనూర్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. ఇంటి నిర్మాణంలో భాగంగా చేపడుతున్న గోడలు, ప్లా స్టరింగ్ తదితర పనుల్లో నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయని లబ్ధిదారుడు తెలిపారు. పనులను అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతను నిర్ధారించాల్సి ఉన్నప్పటికీ, పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేకుండానే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే ఆశతో నిర్మాణ పనులు ప్రారంభించామని, అయితే పనుల్లో లోపాలు కనిపించడంతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిధులు సక్రమంగా వినియోగించడంతో పాటు, నిర్మాణంలో నాణ్యమైన మెటీరియల్ ఉపయోగించాలని కోరారు.

**అధికారులు స్పందించాలి..**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయాలని లబ్ధిదారుడు కోరారు. నిర్మాణంలో లోపాలు ఉంటే వాటిని తక్షణమే సరిచేసి ఇల్లు పటిష్టంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యం నెరవేరాలంటే నిర్మాణ పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రపంచ రికార్డు సాధించిన బ్లెస్సి

## వైద్యుల ఆధ్వర్యంలో ఘన సన్మానం








**ఉద్యమ కెరటం, సిరిసిల్ల :** ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కోసం చిన్న వయసులోనే విశేష కృషి చేస్తూ ప్రపంచ రికార్డు సాధించిన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన చిన్నారి ప్రకృతి బ్లెస్సిని ప్రముఖ వైద్యులు ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం బద్దెనపల్లి గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బ్లె స్సి మూడో ఏట నుంచే ప్రకృతి పరిరక్షణపై ఆసక్తి పెంచుకుని విత్తనాల సేకరణ, విత్తన బంతుల తయారీ, వాటిని అడవుల్లో చల్లడం వంటి కార్యక్రమాలను చేపడుతోంది. పర్యావరణ పరిరక్షణలో ఆమె చేస్తున్న కృషికి గుర్తింపుగా ఐ రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్లో స్థానం దక్కింది. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ రమణరావు, డాక్టర్ శ్రీవాణి దంపతులు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అక్షయ్ సమక్షంలో చిన్నారి బ్లెస్సిని ఆసుపత్రి ప్రాంగణంలో సత్కరించారు. శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుని సమాజంలో చైతన్యం తీసుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఆమె నాటుతున్న ప్రతి విత్తనం భావితరాలకు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. చిన్నారి బ్లెస్సి మాట్లాడుతూ తన కృషికి లభించిన ప్రపంచ రికార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. వైద్యులు అందించిన ప్రోత్సాహం తనలో మరింత స్ఫూర్తిని నింపిందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది విష్ణు, మహేష్, చిన్నారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** వర్షాకాలంలో ప్రబలే డెంగ్యూ, మలేరియా, చికున్గున్యా వంటి వ్యాధులను నివారించేందుకు తాండూర్ మండలం రాజీవ్నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక దోమల నివారణ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని కాలువలు, మురుగు నీటి ప్రవాహ ప్రాంతాలు, నిల్వ నీరు ఉన్న ప్రదేశాలతో పాటు దోమల వ్యాప్తి అధికంగా ఉన్న ప్రాంతాల్లో గురువారం దోమల మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మామిడాల లలిత రాజేశం మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే గ్రామపంచాయతీ లక్ష్యమన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు పరిశుభ్రత పాటించాలని గ్రామస్థులకు సూచించారు. దోమల నివారణ చర్యలను నిరంతరం కొనసాగిస్తూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామాదేవి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉల్లా స్ పథకంతో మహిళలకు అక్షర జ్ఞానం




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మహిళా సంఘాల్లోని నిరక్షరాస్య వయోజన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉల్లా స్ పథకాన్ని అమలు చేస్తోందని మండల ఇన్చార్జ్ ఏపీఎం లింగరాజ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లా డుతూ మండలంలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతిఒక్కరికీ అక్షర జ్ఞానం కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యా శాఖ, సెర్ప్ సంయుక్త భాగస్వామ్యంతో పథకం అమలు కానుందని పేర్కొన్నారు. ఉల్లా స్ పథకంలో భాగంగా మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులు, బడి మానేసిన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి వరకు, వారి ఆసక్తి మేరకు ఓపెన్ డిగ్రీ వరకు విద్యనందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యా పరంగా అభివృద్ధి సాధించాలని కోరారు.

# పంపిణీకి సిద్ధంగా టేకు, మునగ మొక్కలు

## ఉద్యానవన అధికారి అర్చన



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఉద్యానవన నర్సరీలైన కన్నాల, బెల్ల ంపల్లిలో టేకు, మునగ మొక్కలు ఉచితంగా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని బెల్ల ంపల్లి ఉద్యానవన అధికారి అర్చన ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కలు అవసరమైన రైతులు పట్టా పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్పోర్ట్ సైజ్ ఫొటోతో ఉద్యానవన నర్సరీలలో సంప్రదించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొక్కల పంపిణీకి సంబంధించిన ఇతర వివరాల కోసం సెల్:8977713955 నంబర్కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని వివరించారు.

# భవనం పైనుంచి దూకి యువకుడి మృతి

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సత్తుపల్లి పట్ట ణంలో గురువారం తెల్ల వారుజామున విషాద ఘటన చోటుచేసుకుంది. భవనం రెండో అంతస్తు నుంచి కిందికి దూకడంతో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు, కార్యాలయ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు మండలం పోరంకి గ్రామానికి చెందిన బొడ్డు వినీత్ (29) సత్తుపల్లి వేంసూరు రోడ్డులోని విస్తార్ ఫైనాన్స్ కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్గా కొంతకాలంగా పనిచేస్తున్నాడు. సత్తుపల్లి అంబేద్కర్నగర్లో ఓ గదిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున సుమారు 2గంటల సమయంలో వినీత్ సత్తుపల్లి పట్టణంలోని నగర పంచాయతీ, మిలీనియం స్కూల్ రోడ్డు ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్లి ఓ భవనం పైకి ఎక్కాడు. అనంతరం అక్కడి నుంచి ఓ ఇంట్లోకి వెళ్లడంతో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు ఒక్కసారిగా దొంగ అంటూ కేకలు వేశారు. దీంతో భయాందోళనకు గురైన వినీత్ వెంటనే వెనుదిరిగి భవనం రెండో అంతస్తు నుంచి కిందికి దూకాడు. కింద ఉన్న రాయికి తల బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడి రక్తస్రావమైంది. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి వినీత్ను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. వినీత్ అర్ధరాత్రి సమయంలో భవనం పైకి ఎందుకు వెళ్లాడు..? ఇంట్లోకి వెళ్లడానికి కారణమేంటి..? అనే అంశాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# ఘనంగా రేణుకా చౌదరి జన్మదిన వేడుకలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి రేణుకా చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేణుకా చౌదరి ప్రజా సేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, కమల్ పాషా, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, జాతీయ బీసీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుబ్బారెడ్డి , సీనియర్ నాయకులు మలిరెడ్డి మురళిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఏరియాలో సింగరేణి సంస్థ డైరెక్టర్ పర్యటన



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సింగరేణి సంస్థ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు గురువారం సత్తుపల్లి ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియాలోని గనులు, వివిధ విభాగాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. మొదట జనరల్ మేనేజర్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ ఎస్.వెంకటచారి సమక్షంలో అన్ని గనులు, విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం జరిపారు. బొగ్గు నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత అంశాలపై సమీక్షించారు. ఏరియాకు నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఉత్పత్తి ప్రక్రియలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం కిష్టారం ఓపెన్‌కాస్ట్, జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ గనులను సందర్శించారు. రూ.6కోట్లకు పైగా విలువైన 6.4 క్యూబిక్ మీటర్ల బకెట్ సామర్థ్యం కలిగిన నూతన కోమట్సు లోడర్ల ను ప్రారంభించారు. అలాగే జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ గని వీక్షణ కేంద్రాన్ని సందర్శించి గనిలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఆయన వెంట సత్తుపల్లి ఏరియా అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.

# మాలి కులస్తుల సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** తెలంగాణ రాష్ట్ర మాలి సంఘం ప్రతినిధులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావు, ఉపాధ్యక్షులు ఆదే నాందేవ్, గుర్నులే నారాయణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్లే శ్రీనివాస్ మాలి కులస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మాలి కులస్తుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


# రెండు మూడు రోజుల్లో సాగర్ ఆయకట్టు కు సాగునీరు

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్‌రెడ్డి తో మంత్రి తుమ్మల భేటీ**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం హైదరాబాద్లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్‌రెడ్డిని కలిసి ఖమ్మం జిల్లా లో పంటల పరిస్థితిని వివరించారు. సాగర్ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన పంటలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దీంతో మరో రెండు, మూడు రోజుల్లో సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు అందే అవకాశం ఉందని పేర్కొన్నారు. పంటలు ఎండిపోకుండా నీటిని అందించాలని సత్తుపల్లి నియోజకవర్గ రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరగా, ఆయన వెంటనే స్పందించి నీటి పారుదల శాఖ మంత్రితో సమావేశమయ్యారు. సాగర్ ఆయకట్టు రైతులకు త్వరలో సాగునీరు అందనున్న నేపథ్యంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# డిప్యూటేషన్‌పై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించి, డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయునికి గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం గ్రామ సర్పంచ్ రాథోడ్ రమేష్, ఉప సర్పంచ్ షబ్బీర్ ల ఆధ్వర్యంలో పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు అందించిన సేవలను, విద్యార్థుల అభివృద్ధికి వారు చేసిన కృషిని గ్రామ పెద్దలు కొనియాడారు. గ్రామ అభివృద్ధిలో, విద్యా రంగంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వారిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థు ల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# సీసీఐపై రాజకీయ విమర్శలు మానుకోవాలి

- **కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బాలురి గోవర్ధన్‌రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు జోగు రామన్న సీసీఐ పరిశ్రమ అంశంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బాలురి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.250 కోట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్రం నిధులు మంజూరు చేసి, సంబంధిత జీఓ అమలైతే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. సీసీఐ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం సరికాదని పేర్కొన్నారు. జోగు రామన్న రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేసిన సమయంలో సీసీఐ పరిశ్రమ, ఇండస్ట్రియల్ కారిడార్ అంశాలపై ఎందుకు దృష్టి సారించలేదని ప్రశ్నించారు. సీసీఐ పునఃప్రారంభం కోసం కాంగ్రెస్ ప్రభుత్వ సహకారం కోరితే సీసీఐ సాధన సమితి పోరాటానికి తమ పార్టీ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అదేవిధంగా జోగు రామన్న ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ కోసం యాపల్గూడ, రాంపూర్ తదితర ప్రాంతాల్లో రైతుల భూముల విషయంలో వ్యవహరించిన తీరుపై పలు ఆరోపణలు చేశారు. ఆ పరిశ్రమ పనులు ప్రారంభం కాకపోవడంపై ఆయన ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సహకరించాలని, ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేయడం మానుకోవాలని జోగు రామన్నకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని బద్నాం చేసే ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఖీజర్ పాషా, జిల్లా పబ్లిసిటీ కోఆర్డినేటర్ మేకల జితేందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకర్గౌడ్, తిరుమని మహేందర్, ఆసిఫ్, జోగు సంతోష్, ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఉద్యమ కెరటం, జైనూర్:** గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలు ఉచిత మెగా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్రావు కోరారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో గణేష్ ప్రైవేట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో, సిర్పూర్(యు) మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మలిదు ఉదయ్కిరణ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ కొడప ప్రకాష్, లింగాపూర్ సర్పంచ్ జాదవ్ రాజశేఖర్, వైద్యాధికారి ఉదయ్కిరణ్, ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణ ప్రసాద్ చౌహాన్తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారు పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు, మందులు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇలాంటి మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. పక్షవాతం, క్యాన్సర్, కిడ్నీ, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రత్యేక వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్యజ్యోతి చౌహాన్, మాజీ జెడ్పీటీసీ లక్కా నాయక్, సర్పంచులు తొడసం రాజేందర్, మెస్రం స్పందన భూపతి, మెస్రం అంబాజీరావు, మాజీ సర్పంచ్ శ్యామ్‌రావు, పెందూర్ ప్రకాష్, తొడసం ధర్మారావు, జాతోత్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



# జాబ్ ఫ్రాడ్‌లో దంపతులపై కేసు నమోదు

**మహిళ అరెస్ట్**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.18.50 లక్షలు మోసం చేసిన నిందితుల్లో ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఇచ్చోడ ఎస్‌హెచ్ఓ కె.నరేష్ కుమార్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇచ్చోడ మండలంలోని కామగిరి గ్రామానికి చెందిన నక్కల రమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఫిర్యాదుదారుడి సోదరుడు రాజశేఖర్‌రెడ్డికి పరిచయమైన ఉప్పాడి @ ఉమ్మడి శంకర్ కోర్టు లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల చొప్పున డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో బాధితులు విడతల వారీగా మొత్తం రూ.18.50 లక్షలను ఉప్పాడి శంకర్, అతని భార్య ఉప్పాడి ఉమ్మెడ లావణ్య బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. డబ్బులు తీసుకున్న అనంతరం ఉద్యోగాలు ఇప్పించలేకపోయామని, మొత్తం డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పి నిందితులు కేవలం రూ.1లక్ష మాత్రమే తిరిగి చెల్లించారు. మిగిలిన రూ.17.50 లక్షలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో జీడిమెట్ల, హైదరాబాద్‌కు చెందిన నిందితురాలు ఉప్పాడి ఉమ్మెడ లావణ్య ను ఇచ్చోడ పోలీసులు అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే మోసపూరిత మాటలను నమ్మి ఎవరూ ముందుగా డబ్బులు చెల్లించవద్దని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌హెచ్ఓ నరేష్ కుమార్ సూచించారు.

# ప్రైవేట్ రంగంలోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా ప్రైవేట్ రంగంలో లభించే ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన యువతకు ప్రైవేట్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రారంభ వేతనం తక్కువగా ఉన్నప్పటికీ కష్టపడి పనిచేస్తే అనుభవంతో పాటు పదోన్నతులు, అధిక వేతనాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థు లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ నియామక పత్రాలను అందజేసి అభినందించారు. యువత తమ ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా, ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు, అధ్యాపకులు, యువతి, యువకులు పాల్గొన్నారు.




# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండలం జంగం గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ గురువారం పరిశీలించారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపడుతున్న పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాగునీటి సౌకర్యాలు, చేతిపంపులు, రహదారులు, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. పనిచేయని చేతిపంపులను గుర్తించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్థులకు సూచించారు. గ్రామ అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రజలు తమ సమస్యలను పంచాయతీ దృష్టి కి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.



# మీసేవ కేంద్రాల్లో వేర్వేరు రుసుములేంటి..?

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని కొత్త మీసేవ కేంద్రంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు రూ.80 వసూలు చేస్తుండగా, పాత మీసేవ కేంద్రంలో రూ.100 వరకు వసూలు చేస్తున్నారని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అదనపు వసూళ్లకు పాల్పడుతున్న నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే ప్రభుత్వ సేవకు మీసేవ కేంద్రాల్లో వేర్వేరు రుసుములు వసూలు చేయడం సరికాదన్నారు. పేద ప్రజలు, విద్యార్థులకు అందాల్సిన ప్రభుత్వ సేవలను కొందరు నిర్వాహకులు వ్యాపారంగా మార్చుకుంటున్నారని విమర్శించారు. జిల్లాలోని అన్ని మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకే రకమైన రుసుములు అమలు చేయాలని కోరారు. అదనపు వసూళ్లపై అధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మీసేవ కేంద్రం వద్ద ప్రభుత్వం నిర్ణయించిన సేవా రుసుముల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. అధికారులు వెంటనే స్పందించి అదనపు వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని, లేనిపక్షంలో బాధితులను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



# చేయూత పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టా లి

**జిల్లా కలెక్ట ర్ గరిమ అగ్రవాల్**



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** చేయూత పింఛన్ల కోసం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, పైలేరియా, డయాలసిస్ బాధితులు తదితర ఏడు రకాల పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతోందని తెలిపారు. దరఖాస్తుదారులకు ఫారాలు, అవసరమైన ధ్రువపత్రాలపై అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి దరఖాస్తుతో ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్బుక్ తదితర పత్రాలను జత చేయాలని సూచించారు. ఆయా వర్గాలకు అవసరమైన ప్రత్యేక ధ్రువపత్రాలను కూడా సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను జాగ్రత్తగా నింపి, ఆన్లైన్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

**ప్రత్యేక సదరం శిబిరాలు..**

దివ్యాంగులు, తలసేమియా, సికిల్సెల్, హిమోఫీలియా బాధితుల కోసం సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక సదరం వైకల్య నిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్హులకు సదరం సర్టిఫికెట్లు త్వరగా జారీ చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. దరఖాస్తుదారులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లోని స్వీకరణ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో విద్యార్థి నిల ఆందోళన



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పోచంలొద్ది కేజీబీవీలో విద్యార్థి నిలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆందోళన చేపట్టారు. పాఠశాల ఆవరణలో ధర్నా నిర్వహించి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కేజీబీవీలో గేట్ వాచ్మెన్గా పనిచేస్తున్న జాదవ్ సుమన్ తమ పట్ల అనుచితంగా, దురుసుగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి నిలు ఆరోపించారు. అదేవిధంగా పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందడం లేదని, ఆహారం నాణ్యతపై కూడా సమస్యలు ఉన్నాయని తెలిపారు. విషయం తెలుసుకున్న ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మధురాజ్ మడావి కేజీబీవీని సందర్శించి విద్యార్థినిలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాచ్మెన్పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను నిర్ధారించాలనీ, ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినిలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. విద్యార్థినిల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శంకర్, సిర్పూర్(యు) మండల ఆదివాసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అర్క యుగేందర్, ప్రధాన కార్యదర్శి ఆత్రం సుధాకర్, ఆత్రం మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

# వరుస దొంగతనలతో రెచ్చిపోతున్న దొంగలు....

- **4.1/2 తులాల బంగారు ఆభరణాలు. 75 తులాల వెండి వస్తువులు, నగదు చోరి**
- **వరుస దొంగతనలతో రెచ్చి పోతున్న దొంగలు**
- **దేవాలయలు, తాళం వేసిన ఇల్లే దొంగల టార్గెట్...**



**ఉద్యమ కెరటం,తూప్రాన్ :** తూప్రాన్ పట్టణంలో వరుస దొంగనలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.తూప్రాన్ పట్టణంలోని 4 వ వార్డు బ్రమ్మణ వీధి కి చెందిన తాత కామేష్ (32) అనే వ్యక్తి తన భార్య సాయిలక్ష్మి తో కలిసి ఈనెల 11 వ తేదిన హైదరాబాద్ లోని బంధువుల ఇంటికి వెళ్లి 12 వ తేదిన రాత్రి 10:30 గంటలకు ఇంటికి వచ్చిన దంపతులకు ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూడగ ఇంటికినీ బీరువా తాళాలు పగలగొట్టి బీరువాలో దాచిపెట్టిన బంగారు ఆభరణాలు 1). బంగారు నల్లపూసల తాడు 2 తులాలు, 2).బంగారు కమ్మ బుట్టలు 1 తులం, 3). బంగారు ఉంగరాలు 2 అర్ధ తులం, 4).బంగారు చైన్ లాకెట్ లు 1 తులం, వెండి వస్తువులు 5).వెండి పళ్లెం 70 తులాలు,6). కాలి పట్టీలు 5 తులాలు,మొత్తం 4.1/2 తులాల బంగారు ఆభరణాలు,75 తులాల వెండి వస్తువులు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్టు గుర్తించి వెంటనే పోలీసులకు పిర్యాదు చేయడంతో విషయం తెలుసుకున్న పోలీసులు తూప్రాన్ సీఐ వెంకట్ రాజా గౌడ్,ఎస్ఐ గంగరాజు,లు ఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు,నిందితుడిని పట్టుకునేందుకు కాలనిలో ఉన్న సీసీ టీవీ పుటేజ్ లను పరిశీలిస్తున్నట్లు తూప్రాన్ సీఐ వెంకట్ రాజా గౌడ్ తెలిపారు,ఎస్ఐ గంగరాజు, క్లూస్ సిబ్బంది పాల్గొన్నారు.తూప్రాన్ మండలంలో వరుస దొంగతలతో రెచ్చిపోతున్న దొంగలతో హడాలిపోతున్న స్థానికులు ఇల్లు విడిచి బయటకు వెళ్లా లంటేనే జంకుతున్నారు, పోలీసులు రాత్రి వేళల్లో కాలనీలలో సరైన గస్తీ నిర్వహించక పోవడం వల్లే తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని స్థా నికులు వాపోతున్నారు.

# మెరుగైన వైద్య సేవలతో మరిన్ని ర్యాంకులు సాధించాలి

**జిల్లా కలెక్ట ర్రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బోధన విధానం, మౌలిక వసతులు, ఇతర ప్రమాణాల ఆధారంగా ఐఐఆర్ఎఫ్ ప్రకటించిన ర్యాంకింగ్లో రిమ్స్ వైద్య కళాశాల జాతీయ స్థాయిలో 139వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యుల బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్కు పూలమొక్కను అందజేసి ర్యాంకింగ్కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వైద్య కళాశాలలో విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన విద్య, సౌకర్యాల ఫలితంగానే ఈ గుర్తింపు లభించిందని డైరెక్టర్ తెలిపారు. ఈ ఘనత సాధించిన రిమ్స్ పాలకవర్గాన్ని, అధ్యాపకులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలందించి మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నరేష్, శిరీష్, సందీప్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ ముందే కేపీహెచ్బీ సమస్యల ఏకరువు

- **వేదికగా ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థా పన సభ**
- **దశాబ్దాల ఇబ్బందులను ప్రస్తావించిన ఎమ్మెల్యే**
- **హౌసింగ్ బోర్డు స్థ లాలను కాపాడాలని విజ్ఞప్తి**



**ఉద్యమ కెరటం,కూకట్ప :** పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన సభ.. కూకట్పల్లి నియోజకవర్గ దీర్ఘకాలిక సమస్యల పరిష్కార వేదికగా మారింది. కేపీహెచ్బీ కాలనీలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఎదుటే స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థా నిక ఇబ్బందులను కుండబద్దలు కొట్టారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు మోక్షం కల్పించాలని సీఎంను నేరుగా కోరారు.కేపీహెచ్బీలోని క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి గురువారం భూమిపూజ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 నియోజకవర్గాల్లో సుమారు రూ.807.40 కోట్లతో ఈ టవర్లు నిర్మించనున్నారు. ఈ సభలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్ది ళ్ల శ్రీధర్బాబు, పొన్నం ప్రభాకర్, మహేందర్రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాలుపంచుకున్నారు.సభలో ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల తరఫున పలు కీలక విజ్ఞప్తులు చేశారు. వసంతనగర్, సర్దార్ పటేల్ నగర్, సీబీసీఐడీ, ఎన్ఆర్ఐ, భగత్సింగ్ నగర్ కాలనీల్లో ఏభై ఏళ్లుగా నివాసం ఉంటున్న ప్రజల ఇళ్ల అనుమతుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే, 2004లో నిర్మించిన 630 ఎల్ఐజీ ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తుది ఖర్చు, వడ్డీల సాకుతో ఆగిపోయిందని, వెంటనే ఆ ప్రక్రియ పూర్తి చేసి పేదలకు న్యాయం చేయాలని కోరారు.కేపీహెచ్బీ పరిధిలో సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేసి దక్కించుకున్న 88 ఎకరాల హౌసింగ్ బోర్డు స్థలాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. రమ్య గ్రౌండ్లో పాఠశాల కోసం కేటాయించిన మూడెకరాల స్థలంతో పాటు, స్థా నికుల హక్కు అయిన పౌర సదుపాయాల (ఎమ్యూనిటీస్) స్థ లాల్లో హౌసింగ్ బోర్డు అధికారులు బోర్డు లు పాతడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయా స్థలాలను కాపాడి ప్రజల అవసరాలకే వినియోగించేలా చూడాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

# వర్షపు నీటితో పంటకు ముప్పు





**ఉద్యమ కెరటం, వాంకిడి:** పంట చేతికొచ్చే సమయంలో వర్షపు నీరు పొలంలో నిలిచిపోవడంతో పత్తి పంట దెబ్బతింటోందని వాంకిడి మండల కేంద్రానికి చెందిన రైతు ఇటన్కార్ బాపురావు ఆవేదన వ్యక్తం చేశారు. తన పంటను కాపాడేందుకు అధికారులు వెంటనే జోక్యం చేసుకుని నీటి సమస్యను పరిష్కరించాలని కన్నీటి పర్యంతమవుతూ వేడుకున్నారు. వాంకిడి శివారులోని తన వ్యవసాయ పొలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు భారీగా నీరు చేరి రోజుల తరబడి బయటకు వెళ్లడం లేదని తెలిపారు. పక్క పొలానికి వేసిన కట్ట కారణంగా వర్షపు నీటి ప్రవాహం అడ్డుకుపోయి తన పొలంలోనే నీరు నిలిచిపోతోందని ఆరోపించారు. దీంతో పత్తి మొక్కలు బలహీనపడుతూ పంట దెబ్బతింటోందని తెలిపారు. సమస్యను గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినా, పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేదని వాపోయాడు. భారీ వర్షం కురిస్తే పత్తి పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## విద్యా ప్రస్థా నానికి తొలి అడుగు: సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్లో ఘనంగా ఓరియంటేషన్ డే

**ఉద్యమ కెరటం,మేడ్చల్**




సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థుల కోసం ఓరియంటేషన్ డే కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాలలో అడుగు పెట్టిన కొత్త విద్యార్థులకు క్యాంపస్ నిబంధనలు, నియమావళి, విద్యా విధానాలు మరియు క్రమశిక్షణపై సమగ్రమైన అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ వేడుకను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ సీ.హెచ్. గోపాల్ రెడ్డి, సెక్రటరీ వసంతలత, సీఈఓ అభినవ్, డైరెక్టర్ ఏ. రాజిరెడ్డితో పాటు వివిధ విభాగాల డీన్లు మరియు హెచ్ఓడీలు ( హెచ్వోడిస్ ) ముఖ్య అతిథులుగా విచ్చేసి నూతన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మేధావులు, కళాశాల యాజమాన్యం విద్యార్థులను ఉద్దే శించి మాట్లాడుతూ... ఇంజనీరింగ్ ప్రయాణం కేవలం డిగ్రీ చదవడమే కాదని, ఇది ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాల నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, క్యాంపస్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక వసతులు, అకడమిక్ మరియు టెక్నికల్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్మెంట్), సాంకేతిక పరిజ్ఞానం మరియు వ్యక్తిగత వికాసంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.నూతన ఉత్సాహంతో, ఉన్నత లక్ష్యాలతో కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు ఈ ఓరియంటేషన్ కార్యక్రమం చక్కటి మార్గదర్శిగా నిలిచింది.

# దేశభక్తి నినాదాలతో మార్మోగిన యాద్గారిపల్లి!

- **కోలా బాలరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ**
- **విద్యార్థు లు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, యువత భారీగా పాల్గొనడంతో పండుగ వాతావరణం**



**ఉద్యమ కెరటం,కీసర:**

భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా కీసర డివిజన్లోని యాద్గారిపల్లి గ్రామంలో గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. కీసర డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కోలా బాలరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జాతీయ జెండాలను చేతబూనిన విద్యార్థులు, యువత గ్రామంలోని వీధుల్లో ర్యాలీగా కదిలారు. దేశభక్తి గీతాలు, నినాదాలతో గ్రామం మార్మోగింది. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ ర్యాలీతో యాద్గారిపల్లిలో దేశభక్తి వెల్లివిరిసింది.

**దేశభక్తి భావనను చిన్ననాటి నుంచే పెంపొందించాలి**

ఈ సందర్భంగా కోలా బాలరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థు ల్లోచిన్ననాటి నుంచే దేశం పట్ల ప్రేమ, జాతీయ జెండా పట్ల గౌరవం, దేశభక్తి భావన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నేటి విద్యార్థు లే రేపటి దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు.'హర్ ఘర్ తిరంగా' వంటి కార్యక్రమాలు జాతీయ ఐక్యతను, దేశభక్తిని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**మోదీ పిలుపుకు గ్రామంలో విశేష స్పందన**

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి యాద్గారిపల్లి గ్రామంలో విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ర్యాలీలో పాల్గొన్న విద్యార్థి నీ, విద్యార్థు లకు స్వీట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# తొలి టెస్ట్‌లో స్నీకో వివాదంపై దుమారం





ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో స్నీకో వివాదం తీవ్ర దుమారం రేపింది. టెక్నాలజీ సాయంతో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ప్రస్తుతం ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది.రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం డార్విన్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్ తొలి రోజు ఆటలో బంగ్లాదేశ్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బంగ్లాదేశ్ యువ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. స్టీవ్ స్మిత్ (109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు.అయితే ఇన్నింగ్స్ ఆరంభంలోనే అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. టెక్నాలజీ సాయంతో బచాయించాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 21వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎబాడోట్ హొస్సేన్ వేసిన ఈ ఓవర్ నాలుగో బంతి స్టీవ్ స్మిత్ బ్యాట్‌కు దగ్గరగా వెళ్తూ కీపర్ చేతిలో పడింది. దాంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు వికెట్ కోసం అప్పీల్ చేశారు. స్మిత్ కూడా ఔటేనని భావించి పెవిలియన్ వైపు నడిచాడు. కానీ అంపైర్ కుమార్ ధర్మసేన ఔటివ్వకపోవడంతో బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో బంతి బ్యాట్‌కు తాకినట్లు స్పైక్ కనిపించలేదు. దాంతో స్మిత్ తిరిగి బ్యాటింగ్ చేపట్టాడు. అయితే ఈ నిర్ణయం తీవ్ర వివాదాస్పదమైంది. టెక్నాలజీలో లోపం ఉందని నెటిజన్లు ఆరోపించారు. ఆస్ట్రేలియా ఛీటింగ్ చేసిందని మండిపడ్డారు.తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో ఈ ఘటనపై స్మిత్ స్పందించాడు. తాను ఔటనే భావించానని, కానీ బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదన్నాడు. 'నేను ఔటయ్యాననే భావించాను. నేను చాలా అదృష్టవంతుడిని. టెక్నాలజీనే నన్ను కాపాడింది. ఒకవేళ అంపైర్ ఔటిచ్చి ఉంటే నేను వెళ్లిపోయేవాడిని. కొన్నిసార్లు ఇలా జరుగుతుంటుంది. అయితే బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయాన్ని నేను కచ్చితంగా చెప్పలేను. కానీ బ్యాట్‌కు తాకినట్లు నాకు అనిపించింది.'అని స్మిత్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హొస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజులో తంజిద్ హసన్(32 బ్యాటింగ్), మోమినుల్ హక్(35 బ్యాటింగ్) ఉన్నారు.

# శ్రీలంక పర్యటనలో పడిక్కల్ చెలరేగుతాడు

## మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం




శ్రీలంక పర్యటనలో టీమిండియా యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ చెలరేగుతాడని మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం చెప్పాడు. శ్రీలంక కండిషన్స్ అతని బ్యాటింగ్ శైలికి సరిగ్గా సరిపోతాయని తెలిపాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారం గాలే వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌లో దేవదత్ పడిక్కల్ మూడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. సాయి సుదర్శన్ గాయంతో ఈ పర్యటనకు దూరమవడంతో పడిక్కల్‌కు మార్గం సుగుమమైంది. అంతేకాకుండా వామప్ మ్యాచ్‌లో అతను అద్భుతమైన శతకంతో చెలరేగాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన రహానే.. పడిక్కల్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాడు. టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ గురించి ఆలోచించకుండా.. టెస్ట్ సిరీస్‌పై ఫోకస్ పెట్టాలని సూచించాడు. శ్రీలంక జట్టును ఏ మాత్రం తక్కువ అంచనా వేయకూడదని హెచ్చరించాడు. 'శ్రీలంక కండిషన్స్ దేవదత్ పడిక్కల్‌కు సరిగ్గా సరిపోతాయి. అతను మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు కాబట్టి.. ఆరంభంలో కాస్త జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. ఒకసారి క్రీజులో కుదురుకున్న తర్వాత స్పిన్ బౌలింగ్‌ను అతను సమర్థవంతంగా ఎదుర్కోగలడు. ఫ్రంట్ ఫుట్, బ్యాక్ ఫుట్ షాట్స్‌తో అతని వద్ద పూర్తి స్థాయి బ్యాటింగ్ నైపుణ్యాలు ఉన్నాయి. అయితే మూడో స్థానంలో ఆడే బ్యాటర్ ముందు చూపుతో ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ మూడో స్థానం బ్యాటర్ రాణిస్తే.. జట్టు మొత్తం ఆధిపత్యం చెలాయించగలదు. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ అతను మంచి రిథమ్‌లో కనిపిస్తున్నాడు. అతను తన ఫామ్, రిథమ్ నమ్ముకొని ఆడాలి. తనపై తాను అనవసర ఒత్తిడి పెంచుకోకుండా ఉండటం ముఖ్యం. అతనికి పరుగులు ఎలా చేయాలో తెలుసు. స్పిన్నర్లపై కట్, స్వీప్, స్టెప్ ఔట్ షాట్స్‌తో ఎదురుదాడి చేయగలడు.'అని రహానే చెప్పుకొచ్చాడు. భారత్ డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్ గురించి ఆలోచించి శ్రీలంకను తేలికగా తీసుకోకూడదని రహానే హెచ్చరించాడు. 'డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌ను దృష్టిలో పెట్టుకొని శ్రీలంకను తేలికగా తీసుకోకూడదు. భారత్ ముందుగా తొలి టెస్ట్ గెలవడంపై ఫోకస్ పెట్టాలి. ఆ తర్వాతే రెండో టెస్టు గెలిచి 2-0తో సిరీస్ క్లీన్ స్వీప్ చేయడం గురించి ఆలోచించాలి. కీలకమైన క్షణాలను గుర్తించి ఆధిపత్యం చెలాయిస్తేనే సిరీస్ కైవసం అవుతుంది. ఈ సిరీస్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ఎందుకంటే టెస్ట్‌ల్లో బాగా రాణించాలనే కసితో శ్రీలంక కూడా ఉంది. ఈ సిరీస్ ఏ మాత్రం ఏకపక్షంగా ఉండదని నేను భావిస్తున్నా.'అని అజింక్యా రహానే అన్నాడు.

# కేఎల్ రాహుల్ మా ఎక్స్‌ఫ్యాక్టర్..

## టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్



శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సన్నద్ధమైంది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. ఈ క్రమంలో ఈ సిరీస్‌ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. అయితే ఈ సిరీస్‌లో వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ తమ ఎక్స్‌ఫ్యాక్టర్ అని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. తొలి టెస్ట్ నేపథ్యంలో మోర్కెల్ గురువారం మీడియాతో మాట్లాడాడు. ప్రస్తుత భారత జట్టు బ్యాటింగ్ లైనప్‌లో కేఎల్ రాహుల్‌కు మాత్రమే శ్రీలంకలో ఆడిన అనుభవం ఉందని, అది జట్టుకు ఉపయోగపడుతుందని తెలిపాడు.'టెస్ట్‌ల్లో కేఎల్ రాహుల్ గత కొన్నేళ్లుగా భారత బ్యాటింగ్ విభాగాన్ని నడిపిస్తున్న తీరు అద్భుతం. శ్రీలంక కండీషన్స్, పిచ్‌లపై అతనికి అపారమైన అనుభవం ఉంది. అతనికి ఉన్న ఈ అనుభవం యువ ఆటగాళ్లకు ప్రాక్టీస్ సెషన్స్‌లో ఎంతగానో ఉపయోగపడింది. అదేవిధంగా గత కొన్ని నెలలుగా మా ప్లేయర్స్ వ్యక్తిగతంగా తమ ఆటను ఎంతో మెరుగుపరుచుకున్నారు. ఈ సిరీస్‌ను గెలవడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేశాం. ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు 10 రోజుల ముందే ఇక్కడికి వచ్చాం.'అని మోర్నీ మోర్కెల్ చెప్పుకొచ్చాడు. తొలి టెస్ట్‌లో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉందని మోర్నీ మోర్కెల్ తెలిపాడు. గాలె పిచ్ కండిషన్స్ పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఓవైపు నుంచి భారత స్పిన్ దళం అటాక్ చేస్తే.. మరో వైపు నుంచి పేసర్లు ఒత్తిడి తీసుకు రాగలరని తెలిపాడు. 'గాలే పిచ్ చూడటానికి మంచి వికెట్‌లా కనిపిస్తోంది. కానీ మ్యాచ్ సాగేకొద్దీ పిచ్‌లో మార్పు ఉంటుందని నేను అనుకుంటున్నా. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే విధంగా వేం సిద్ధమయ్యాం. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి మాకు కావాల్సింది మానసిక బలం, బ్యాటింగ్‌లో సమయం, బౌలింగ్ స్పెల్స్ వేయడం, బంతిని సరైన ప్రదేశంలో వేయడం వంటివి.'అని ఇయాన్ మోర్గాన్ చెప్పుకొచ్చాడు. బ్యాటింగ్ పరంగా టీమిండియా బలంగానే ఉన్నా.. బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా దూరమవ్వడం పెద్ద లోటు కాగా.. జట్టులో ఉన్న ఆటగాళ్లంతా శ్రీలంక పర్యటనకు కొత్త కావడం మరో విశేషం. కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాకు మినహా శ్రీలంక పర్యటనలో టెస్ట్ సిరీస్ ఆడిన అనుభవం మరే ఆటగాడికి లేకపోవడం గమనార్హం.



# గంభీర్‌కు అండగా నిలిచిన హర్భజన్ సింగ్

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అండగా నిలిచాడు. టీమిండియా వైఫల్యానికి గంభీర్‌ను బాధ్యుడిని చేస్తూ అతనిపై విమర్శలు గుప్పించడం సరికాదని అభిప్రాయపడ్డాడు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషని, అందుకే అతన్ని నిర్ణయాలు నచ్చడం లేదని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. గంభీర్ కోచింగ్‌లో భారత జట్టు ఐసీసీ టోర్నీలు గెలిచిందని గుర్తు చేశాడు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. శనివారం నుంచి గాలే వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. అయితే గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెస్ట్‌ల్లో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. ఈ క్రమంలోనే అతని కోచింగ్ తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. శ్రీలంకతో సిరీస్‌కు ముందు మాట్లాడిన హర్భజన్ సింగ్.. గంభీర్‌ను వెనకేసుకొచ్చాడు. 'గౌతమ్ గంభీర్ ఎందుకు ఇంతలా ఎందుకు విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే అతన్ని నిదించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు. గంభీర్ క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచి నాకు తెలుసు. ఆట పట్ల చాలా నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ ఆరంభంలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతనికి మంచి ఫ్రెండ్స్. ఇప్పటికీ వారే స్నేహితులనుకుంటా. అతను ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడుతాడు. అందుకే అతని నిర్ణయాలు కొందరికి నచ్చవు. కవర్ చూసి పుస్తకం ఎలాంటిదో చెప్పకూడదని పెద్దలు అంటారు. గంభీర్‌ను విమర్శించడం కూడా తప్పే. గెలుపు కోసమే ఆడాలని నమ్మే కోచ్ అతను. ఓటమిని ఏ మాత్రం జీర్ణించుకోడు. డ్రా కోసం ఆడేందుకు అస్సలు ఇష్టపడడు. శుభ్‌మన్ గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. అతను గొప్ప ఆటగాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా బ్యాటర్‌గా సత్తా చాటాడు. ఫుట్‌బాల్‌లో లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఆడుతున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో ఆడితే తప్పేంటి? ఏ ఆటగాడికైనా సరే ప్రదర్శనే కొలమానం. వయసు ముఖ్యం కాదు. విరాట్ కోహ్లీ 37 ఏళ్ల వయసులోనూ 20 ఏళ్ల కుర్రాడిలా మైదానంలో చురుకుగా ఉంటాడు. భారత జట్టులో కోహ్లీ.. మెస్సీ లాంటి ప్లేయర్. భారత జట్టులో ఫిట్‌నెస్ విప్లవం తెచ్చింది అతనే. చివరి రోజు 400 పరుగుల లక్ష్యం ఉన్నా సరే విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ మెరుగ్గా రాణిస్తున్నారు. కాబట్టి వారిని వన్డేల్లో కొనసాగించాలి.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.



# భారత్‌తో టెస్ట్‌కు శ్రీలంక జట్టు ప్రకటన

రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగే టెస్ట్ టీమ్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ధనంజయ డిసిల్వా సారథ్యంలోని 16 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను బుధవారం వెల్లడించింది. కమిందు మెండిస్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సీనియర్లతో పాటు ఇటీవల టీమిండియా వామప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న పలువురు ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. వెటరన్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్‌వెల్లా సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ముగ్గురు అనామక ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. సీనియర్ బ్యాటర్ కుశాల్ మెండీస్ తొడ కండరాల గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. మణికట్టు సర్జరీతో పాతుమ్ నిస్సంక సేవలను శ్రీలంక కోల్పోయింది. దాంతోనే 33 ఏళ్ల నిరోషన్ డిక్‌వెల్లాకు పిలుపు దక్కింది.2023లో శ్రీలంక తరఫున అతను చివరి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. స్పిన్‌కు అనుకూలంగా ఉండే గాలే మైదానంలో బలమైన భారత బౌలింగ్ యూనిట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్‌కు అతని చేరిక బలాన్ని చేకూర్చనుంది.ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ కేశర నువంత, బ్యాటర్ పాసిందు సూర్య బండారా, సోనా దినుషా తొలిసారి శ్రీలంక టెస్ట్ టీమ్ పిలుపును అందుకున్నారు. ఇటీవల భారత్‌తో జరిగిన వామప్ మ్యాచ్‌లో నువాంత మూడు వికెట్లు తీసాడు. భారత్-ఏ జరిగిన అనధికారిక టెస్ట్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. దాంతో అతనికి శ్రీలంక జట్టులో చోటు దక్కింది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది.

### భారత్‌తో తొలి టెస్ట్‌కు శ్రీలంక టీమ్:


ధనంజయ డి సిల్వా (కెప్టెన్), కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), లహిరు ఉదార, నిషాన్ మదుష్క, దినేష్ చండిమల్, పసిందు సూర్యబండార, సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా (వికెట్), రమేష్ మెండిస్, ప్రబాత్ జయసూర్య, కేశర నువంత, మిలన్ ద్రువాల్నాండో, ఎఫ్‌సి ధృవాల్నాండో, ఎఫ్. మధుశంక.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
14 ఆగస్టు 2026



# సుకుమార్ కూతురు సుకృతివేణికి బోస్టన్ స్కూల్ స్కాలర్‌షిప్


'పుష్ప' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందారు సుకుమార్. ఇటీవల జాతీయ అవార్డుల్లో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగానూ ఘనత సాధించారు. ఆయన తనయ సుకృతి వేణి కూడా విభిన్న బాటలో పయనిస్తున్నారు. 2024 సంవత్సరానికి జాతీయ ఉత్తమ బాల నటిగా 'గాంధీ తాత చెట్టు'కు అవార్డు సాధించిన సుకృతి వేణి ఇప్పుడు మరో అరుదైన ఘనతను కైవసం చేసుకుంది. అమెరికాలోని 'బోస్టన్ అంతర్జాతీయ బర్క్‌లీ స్కూల్ ఆఫ్ మ్యూజిక్' సంగీత విభాగంలో ఎన్‌సెంబుల్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికై ఫుల్ స్కాలర్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. మొత్తం 272 మంది పిల్లలు ఆడిషన్ ఇవ్వగా, కేవలం 14 మందికి మాత్రమే పూర్తి స్కాలర్‌షిప్ వచ్చింది. అందులో సింగర్స్ విభాగంలో ఎంపికైన ఏకైక విద్యార్థిని సుకృతి వేణి కావడం విశేషం.


# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం

అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.




# అలా ..రజనీకాంత్ గారితో..



టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు, అలాగే సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.

# మందమర్రి మార్కెట్‌లో 'ట్రాఫిక్' నరకం!

## వ్యాపారుల ఇష్టారాజ్యం..!

## నడిరోడ్డుపై నిలుస్తున్న వాహనాలు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** మందమర్రి పట్టణంలోని ప్రధాన మార్కెట్ ప్రాంతంలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న పార్కింగ్, రోడ్ల ఆక్రమణలతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌కు వచ్చే వినియోగదారులతో పాటు స్థానికులు నిత్యం ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుని నరకయాతన అనుభవిస్తున్నారు.

### ఆక్రమణల పర్వం.. కనిపించని పార్కింగ్ స్థలం!

మార్కెట్‌లోని పలువురు వ్యాపారులు తమ దుకాణాలు, షెడ్లను నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల వరకు విస్తరించడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యాపారులు రోడ్లను ఆక్రమించడంతో వాహనాలను నిలిపేందుకు కనీస స్థలం కూడా లేకుండా పోయింది. దీంతో మార్కెట్‌కు నిత్యావసరాలు, ఇతర సరుకుల కొనుగోలుకు వచ్చే ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో తమ వాహనాలను నడిరోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది.

### నిత్యం ట్రాఫిక్ జామ్

రోడ్ల ఆక్రమణకు తోడు, రోడ్డుపైనే అస్తవ్యస్తంగా వాహనాలు నిలుపుతుండటంతో మార్కెట్ వీధులు కాస్త సందులుగా మారిపోతున్నాయి. ఫలితంగా రోజూ వేలాది మంది వచ్చే ఈ మార్కెట్ ప్రాంతంలో తరచూ తీవ్ర స్థాయిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, ఇతర అత్యవసర వాహనాలు కూడా ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంటోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

### చర్యలు తీసుకోవాలి

ఈ సమస్యపై మున్సిపల్, పోలీస్ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ షెడ్లను తొలగించి, మార్కెట్‌లో ఇష్టారాజ్యంగా నిలిపే పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మందమర్రి మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.




Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**